క్లుప్తంగా

వైభవంగా అంకమ్మ తిరునాళ్ల



అమ్మవారి ఊరేగింపు

సత్యవేడు: మండలంలోని అల్లపుగుంట గ్రామంలో అంకమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగాయి. మూడో రోజు సోమవారం రాత్రి 10 గంటలకు అమ్మవారి ఊరేగింపు ప్రారంభమై మంగళవారం ఉదయం 9గంటలకు ముగిసింది. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారి విద్యుద్దీపాల కటౌట్లు కనువిందు చేశాయి.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

పిచ్చాటూరు: రైతులకు 50 శాతం సబ్సిడీకి పచ్చిరొత్త విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సంజీవ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఏఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని రైతు భరోసా కేంద్రాలకు పచ్చిరొట్ట విత్తనాలు చేరినట్లు పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు 1బీ, ఆధార్ కార్డుతో ఆర్‌బీకేలో బయోమెట్రిక్ ద్వారా సబ్సిడీ విత్తనాలను పొందవచ్చన్నారు. మార్కెట్‌లో పది కిలోల జనుము, జీలగ ధర రూ.880 ఉండగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.440కే అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వొకేషనల్ గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు టీసీల అందజేత



బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసైయిన విద్యార్థులకు మంగళవారం ప్రధానోపాధ్యాయులు రమణయ్య టీసీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో పాఠశాలలో 151 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, అందులో 133 మంది పాసైయ్యాయని తెలిపారు. వీరందరూ కాలేజీల్లో చేరేందుకు సకాలంలో టీసీలు అందజేస్తున్నామన్నారు. పాఠశాలలో ఉన్న కాలేజీలో చేరాలని సూచించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాంతారామ్ పవార్‌కు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ది స్కూల్ ఆవరణలో మున్సిపల్, శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శాంతారామ్ పవార్ 5వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమార్తె డాక్టర్ అర్చనాపవార్ మాట్లాడుతూ ప్రజాసేవే ధ్యేయంగా పని చేసిన ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. ది స్కూల్ కరస్పాండెంట్ జనార్దన్‌రావు పవార్, మహేశ్వరరావు పదూల్కర్, బాబు పాల్గొన్నారు.

నియమావళిని అతిక్రమిస్తే చర్యలు



రేణిగుంట: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, దీన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ హెచ్చరించారు. మండలంలోని తూకివాకం పంచాయతీ పరిధిలోని నక్కల కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, వికలాంగుల కాలనీ, తూకివాకం దళితవాడలో మంగళవారం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అర్బన్ సీఐ మల్లికార్జున పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు



పెద్దశేష వాహనంపై ఉభయ నాంచారులతో కల్యాణ వేంకటేశ్వరస్వామి విహారం

నారాయణవనం: టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పెద్ద శేషవాహనంపై పరమపదనాథునిగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మేళ తాళాలు, కోలాట నృత్యాలు, అశేష భక్తులు గోవింద నామస్మరణల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. వేకువజామున 4.30 గంటలకు ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఆలయ మాడవీధుల్లో విష్వక్సేన, చక్రత్తాళ్వార్, కొడిపార్వ వస్త్రంతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు అనంతరం ఆలయంలో ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింప చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీవీరరాఘవ దేవస్థానం నుంచి పట్టుసాలె కులస్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. 11 గంటలకు ఉత్సవ మూర్తులకు ఆగమో క్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు ఉభయ నాంచారుల సంయుక్తంగా శ్రీస్వామివారు ఊంజల్‌సేవలో పాల్గొన్నారు.

నయనానందకరం

రాత్రి 7 గంటలకు పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ఉభయ నాంచారుల సహా స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పెద్ద శేష వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. తదుపరి పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు కార్యక్రమా లను పర్యవేక్షించారు. ఉత్సవాలలో రెండో రోజు బుధవారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై స్వామి వారు దర్శనమివ్వనున్నారు.

అన్నప్రసాదాల వితరణ

బ్రహ్మోత్సవాల్లో 9 రోజుల పాటు కల్యాణ వెంకన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు శ్రీనివాసా డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో అన్నప్రసాదాల వితరణ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఈఓ నాగరత్న తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలను దాతలు అందిస్తారని అన్నారు. ఆలయంలో శుక్ర, శనివారాల్లో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రతి రోజూ కొనసాగించడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు.

గంగమ్మకు ముక్కంటి సారె



సారె తీసుకెళుతున్న అంజూరు శ్రీనివాసులు, పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారంలో గంగమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ముక్కంటి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ఏడు గంగమ్మల జాతరకే పరిమితమైన సారె తాను చైర్మన్‌గా పాలకమండలి ఏర్పాటు అయిన తరువాత బీపీ అగ్రహారం గంగమ్మ, పానగల్ గంగమ్మ, బంగారమ్మతల్లి, నల్లగంగమ్మ, శీతాలాంబ అమ్మవారితో పాటు పట్టణంలో వెలసిన శక్తి అమ్మవార్లకు సారె అందజేసే ఆనవాయితీని తీసుకు వచ్చినట్లు తెలిపారు. గంగమ్మతల్లి అనుగ్రహంతో ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణిపాండు, సుబ్బారావు, ప్రముఖులు లక్ష్మీపతి, ఆర్కాట్ శంకర్, కేపీఆర్ శశి, సుబ్రహ్మణ్యం, కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాతర సందడి



నారాయణవనం: మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు



ఏర్పేడు : పూజలు చేస్తున్న మహిళలు

నారాయనవనం: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో జాతర సందడి నెలకొంది. ఉదయం నుంచి మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. డీకే పాళ్యం, బ్రాహ్మణతాంగాళ్, కీళగరం, నారాయణవనం, తిరువట్యం, వీకె పాళెం, భీమునిచెరువు, కసిమ్మిట్టలో అమ్మవార్ల విద్యుద్దీపాల కటౌట్లను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నడి వీధి గంగమ్మలకు మహిళలు అభిషేకాలను నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో మొక్కులు తీర్చుకున్నారు. నారాయణవనం బస్టాండ్ సమీపంలో, కీళగరం క్రాస్ వద్ద నడి వీధి గంగమ్మలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అంబళ్లు పోశారు. మధ్యాహ్నం కుంభాలతో నైవేద్య సమర్పణ చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో గ్రామాలు సందడిగా మారాయి.

ఏర్పేడులో..

ఏర్పేడు: స్థానిక యాదవవీధిలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. మూడు రోజులుగా వివిధ రకాల పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయాన్నే గంగమ్మ, అంకమ్మ, ముగ్గులు వేసి పూజలు చేశారు. అమ్మవారికి విశేషాలంకరణ చేసి విశేష పూజలు చేపట్టారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యవేడులో వైఎస్సార్ సీపీదే విజయం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన నూకతోటి రాజేష్, నాయకులు

వరదయపాళ్యం: సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకుల సమన్వయంతో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోట రాజేష్ తెలిపారు. మంగళవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన స్వగృహంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో రాజేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరిగిన తీరు, పోలింగ్ సరళిపై మండలాల వారీగా మంత్రికి వివరించారు. పోలింగ్ సరళని పరిశీలిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్న తపన ప్రజల్లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. మంత్రిని కలిసినవారిలో నాయకులు భాను ప్రకాష్‌రెడ్డి, మునిరెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయ బృందం

ఏర్పేడు: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందతుందని, బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పాలని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ అన్నారు. మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లోనే చేర్పాలని తల్లిదండ్రులకు కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని, డిజిటల్ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.

డ్రమ్ సీడర్‌తో పలు ప్రయోజనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లను డ్రమ్ సీడర్‌తో నాటాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. మంగళవారం రైతులకు డ్రమ్ సీడర్ వాడకంపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు నాటడం వలన ఖర్చు తగ్గుతుందన్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. నాట్లకు కూలీల బెడద ఉండదని, నీరు ఆదా అవుతుందన్నారు. డ్రమ్ సీడర్‌ను ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీఈఓలు రేవతి, భారత్ పాల్గొన్నారు.

నేరచరిత్ర లేని వారిని ఏజెంట్లుగా నియమించాలి



అఖిలపక్ష ప్రతినిధులకు ఏజెంట్ల నియామకంపై సూచనలిస్తున్న ఆర్ఓ నరసింహులు

సత్యవేడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లుగా రాజకీయ పార్టీల నాయకులు నేరచరిత్ర, కేసులులేని వారిని ఏజెంట్లుగా నియమించాలని సత్యవేడు రిటర్నింగ్ అధికారి నరసింహులు సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏజెంట్ల నియామకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్ఓ మాట్లాడుతూ పోలింగ్ ఏజెంట్లుగా నియమించే వారి మూడు ఫొటోలు ఆధార్ కార్డు జిరాక్సు అందజేయాలన్నారు. ఏజెంట్లు ఈసీ నియమ నిబంధనలు పాటించా లన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను చదివి అవగాహన చేసుకోవాలని తెలిపారు. గుర్తింపు కార్డు కచ్చితంగా ఉండాలన్నారు. ఏజెంట్లను మార్చుకునే వారు 24 గంటల ముందు వివరాలు అందజేయాలని సూచించారు. ఈఆర్ఓ రామాంజనేయులు, పలు పార్టీల ప్రతినిధులు కె.నిరంజన్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), రోసయ్య(టీడీపీ), చిరంజీవి(కాంగ్రెస్), ధనంజ్(బీఎస్పీ), కిరణ్, వి.రాకేష్, ఎస్ చెంగయ్య, ఈశ్వరయ్య, మౌనిక, వెంకటేష్, కృష్ణారావు, వంశీ, రాకేష్ (వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా), సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారి విగ్రహానికి పలు రకాల అభిషేకాల అనంతరం స్వర్ణాభరణాలతో విశేషాలంకరణ చేశారు. ఆలయంలో 108 కలశాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.



విశేషాలంకరణలో అమ్మవారు



కలశాల ఊరేగింపు

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

నారాయణవనం: మండలంలోని సింగిరి కోనలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి మూలవర్లకు అభిషేకాలు చేశారు. వెండి కవచాలు, సుగంధభరిత పుష్పమాలికలతోఅలంకరించారు. గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్‌బాబు అన్నప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారికి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజు ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు ప్రత్యేక విద్య



సర్వే చేస్తున్న ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్

రేణిగుంట: ప్రత్యేక అవసరాలున్న బడిఈడు పిల్లలకు ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్యను అందిస్తోందని జిల్లా ఐఈ(ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మామండూరు, చైతన్యపురం, ఎస్‌వీ నగర్‌లో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఇళ్లకు వెళ్లి ఐఈఆర్‌టీలు చేస్తున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేరుస్తామన్నారు. ఐఈఆర్‌టీలు జేష్మ, బిందు పాల్గొన్నారు.

మత్తేరిమిట్టలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులకు సూచనలిస్తున్న డీఎస్పీ పైడేశ్వరరావు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పరిధిలోని మత్తేరిమిట్టలో శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇల్లు తనిఖీ నిర్వహించారు. ప్రజల, వాహనాల వివరాలను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ వాహనాలకు అన్ని రికార్డులు ఉండాలని స్పష్టం చేశారు. ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

హరివిల్లు .. కనువిందు



బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో మంగళవారం తేలికపాటి వర్షం కురిసింది. ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. యువకులు సెల్‌ఫోన్లలో ఇంద్రధనుస్సును బంధించారు.

- బుచ్చినాయుడుకండ్రిగ